క్లుప్తంగా

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వేలో పాల్గొన్న నాయకులు

కేశంపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. శనివారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ ఇళ్ల సర్వేను నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్బి సుందరయ్య, తాండ్ర కృష్ణారెడ్డి, చెవేళ్ల నర్సింలు, కసాబ్ ప్రభాకర్‌జీ, అవంచ బాల్‌రాజు, ఉత్తర పల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణితశాస్త్ర వారోత్సవాల ముగింపు



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత శాస్త్ర వారోత్సవాలను సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని వారంరోజుల పాటు పాఠశాలలో వారోత్సవాలను నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, నాటక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



నర్సింహాచారికి నియామకపత్రం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి, రాము

షాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ కన్వీనర్ రాము పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో 234 బూత్ అధ్యక్షుడిగా నర్సింహాచారిని ఎన్నుకున్నారు. అనంతరం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలతో అలవోకగా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో మూటగట్టుకున్న పాపాలను, కాంగ్రెస్ సర్కారు ఒక్క ఏడాదిలోనే మూటగట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్ పాలన ఏడాది గడిచినా, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మాణెయ్య, నాయకులు అనంతం, మహేందర్, ప్రశాంత్, సతీశ్‌గౌడ్, నవీన్ కుమార్, రాజు, తదితరులు ఉన్నారు.

వైభవం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుడు వేణుగోపాలాచార్యులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దైవాలగూడ వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. దైవాలగూడ గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో యజ్ఞహోమాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నాగర్‌కుంట గ్రామానికి చెందిన మల్లీ మహేశ్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ తూర్పిటి రఘురాం పాల్గొన్నారు.


మరింత పారదర్శకంగా 'ఉపాధి'

- కూలీలకు వరం జన్‌మన్‌రేగా యాప్
- సమగ్రంగా పథకం వివరాలు నిక్షిప్తం
- 'కూలీ'ల సమాచారం తెలుసుకునేందుకు దోహదం
- అక్రమాలపై ఫిర్యాదుకు అవకాశం

ఉపాధి పనుల్లో పూర్తి పారదర్శకత కోసం కేంద్రం ప్రభుత్వం తెచ్చిన 'జన్‌మన్‌రేగా' యాప్ ద్వారా సమాచారం అందుబాటులోకి వచ్చింది. కూలీలతో పాటు ఎవరైనా దీనిద్వారా క్షణాల్లో వివరాలు తెలుసుకోవచ్చు. అరచేతిలో ఫోన్ ఉంటే చాలు.. ఎన్నిరోజులు పనిచేశాం, ఏ బ్యాంకులో ఎంత కూలి జమయిందో తెలుసుకోవడంతో పాటు.. ఉపాధిలో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.



గంగారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



మహేశ్వరం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు డబ్బులు చెల్లింపులో అనేక మార్పులు జరుగుతున్నాయి. పారదర్శకతకు బ్యాంకు, తపాల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. కొందరి ఖాతాల వివరాలు అనుసంధానం కాకపోవడం, తప్పుగా నమోదు కావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి కూలీల కోసం కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్‌రేగా' యాప్‌ను ఆవిష్కరించింది. ఇందులో కూలీల, పనుల పూర్తి వివరాలను తెలుసుకునే వీలుంది.

ఆక్టివ్‌గా 3,653 మంది

మండల పరిధి 30 గ్రామ పంచాయతీలలో ఉపాధి పథకం పనులు జరుగుతున్నాయి. అందులో 6,568 కుటుంబాలు(9,231) వ్యక్తులు ఉన్నారు. ఆక్టివ్‌గా 3,653 మంది పనిచేస్తున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, భూమి అభివృద్ధి పనులు, చెరువులు, కుంటల పూడిక తీత, రైతుల పశువుల షెడ్ల నిర్మాణం, వరద మళ్లింపునకు కాలువలు, ఇంకుడు గుంతల తవ్వకం లాంటి పనులు చేపడుతున్నారు.

యాప్‌లో పూర్తి వివరాలు

ఉపాధి పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్‌రేగా' యాప్‌ను రూపొందించింది. ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. ఇందులో కూలీల హాజరు, డబ్బుల జమ విభాగం క్లిక్ చేస్తే సంబంధిత సమాచారం వెలుగు చూస్తుంది. రాష్ట్రం, జిల్లా జాబ్‌కార్డు, కుటుంబ గుర్తింపు సంఖ్య నమోదు చేస్తే వివరాలు క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, కూలీ డబ్బులు బ్యాంకులో జమ వివరాలు కనిపిస్తాయి. కూలీ డబ్బులు జమకాకపోతే దానికి గల కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. మరోవైపు పథకంలో చేపట్టే పనుల సమాచారం తెలుసుకోవడంతో పాటే.. ఉపాధి అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్‌ను అన్ని భారతీయ గుర్తింపు పొందిన భాషల్లో చూసుకోవచ్చు.

కూలీలకు అవగాహన

కూలీ డబ్బుల కోసం చాలా మంది కూలీలు ఏపీఎం కార్యాలయం చుట్టూ తిరుగుతుంటారు. జన్‌మన్‌రేగా యాప్ గురించి వారికి అవగాహన కల్పిస్తే ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుకోవాలి.

వివరాలు తెలుస్తున్నాయి



జన్‌మన్‌రేగా యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాను. దీని ద్వారా కూలీల హాజరు, బ్యాంకు వివరాలు, ఖాతాల్లో కూలీ డబ్బుల జమ గురించి తెలుస్తున్నాయి. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. అందరికీ అవగాహన కల్పిస్తే మంచిది.

– ప్రవీణ్, ఉపాధి కూలీ, ఘట్టుపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



ఉపాధి పథకంలో భాగంగా కేంద్రం తెచ్చిన జన్‌మన్‌రేగా యాప్ కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఉపాధి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. గ్రామ సభల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇందులో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం

సంఘం బలోపేతానికి కృషి



డైరీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు పెంటారెడ్డి, పాలకవర్గ సభ్యులు

సహకారం సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి

బడంగ్‌పేట్: బాలాపూర్ సహకార సంఘం బలోపేతానికి అందరం కలిసి కృషి చేస్తున్నామని సహకారం సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి అన్నారు. శనివారం బాలాపూర్‌లోని బండ్లగూడ ఖాల్సా బాలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశాన్ని సంఘం బ్యాంక్ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సర కేలండర్, డైరీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెంటారెడ్డి మాట్లాడుతూ.. రూ.42కోట్ల టర్నోవర్‌తో బాలాపూర్ సహకారం సంఘం కార్యకలాపాలను కొనసాగిస్తున్నామన్నారు. ఏటా రూ.28లక్షల నికర ఆదాయంలో ముందుకెళ్తున్నామని తెలిపారు. త్రిపుల్‌ఎస్ ఖాతాలను ప్రారంభించి రైతులు, గ్రామస్తులకు మేలు చేస్తున్నామని పేర్కొన్నారు. బాలగణేశ్ పథకం ద్వారా చిన్నారుల పేరుతో ఖాతాలు తెరిచి ఇతర బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకి అందజేస్తున్నామన్నారు. రైతులకు స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందజేస్తున్నామని తెలిపారు. సహకార సంఘాన్ని ఇల్లాలోనే ఉత్తమ సహకార సంఘంగా నిలబెట్టామన్నారు. ఈ మల్టీపర్పస్ కింద సహకార సంఘాల సేవలను గుర్తించిన పలు విదేశీ సంస్థలు, మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన సహకార సంఘాల వారు అధికారులతో కలిసి ఇక్కడకు వచ్చి బాలాపూర్ సహకార సంఘాన్ని ఎలా అభివృద్ధికి బాటలు వేశారో తెలుసుకొని వెళ్తున్నారని గుర్తుచేశారు. మహిళల పొదుపు సంఘాల వారికి రుణాలు కూడా అందిస్తున్నామన్నారు. సేఫ్‌లాకర్ల సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులు, సంఘం సభ్యులు పాలకవర్గం ఆశీస్సులతో సహకారం సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొలన్ తిరుపతిరెడ్డి, పాలకవర్గ సభ్యులు కళ్లెం నిరంజన్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, కొంతం అరుణరెడ్డి, నిరుడి నర్సమ్మ, రావుల లింగం, కొంతం సంపత్‌రెడ్డి, ఇబ్రాం బాలయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ ఎర్ర జైహింద్, శ్రీకాంత్, రాధ తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య'

మహేశ్వరం: తుక్కుగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై భౌతిక దాడి చేయడం, అందరి ముందు కాళ్లు మొక్కించడం అనేది హేయమైన చర్య అని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.కేశవులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహేశ్వరం మండలం తుక్కుగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థిని దండించాడని బయటి వ్యక్తులు పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయుడు రాములుపై భౌతిక దాడి చేయడం, అందరి ముందు విద్యార్థి కాళ్లు మొక్కించడం అనేది హేయమైన చర్యగా పీఆర్టీయూ జిల్లా శాఖ భావిస్తోందన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పల్లకీసేవ

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు రాఘవేంద్రచార్యులు, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి పల్లకీసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ప్రముఖ కాంట్రాక్టర్ యెన్నం గోపాల్‌రెడ్డి రూ.10వేల విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం దేవాలయానికి సంబంధించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్, న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి, భక్తులు శ్రీశైలం, ఎంసాని నర్సింహులు, అశోక్‌గౌడ్, రఘుగౌడ్, రఘునందన్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, వసంతరావు, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ బంటారం బాలికల పాఠశాలలో వచ్చే సంవత్సరం 2025–26గాను ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సునీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, డిసెంబర్ 21 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. చివరి గడువు ఫిబ్రవరి 1వ తేదీలోపు అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 23వ తేదీన 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష వికారాబాద్ జిల్లా బంటారం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఉంటుందని సమయానికి విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ సమావేశ మందిరంలో మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి సహకారంతో స్వింఫై వారి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ఉన్నత విద్యలు అభ్యసించిన యువకులకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వారు నిరుద్యోగులుగా మారారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డేటా సైన్స్‌పై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగులు ఈ శిక్షణ తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణకు ఎంపికైన వారికి ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు ఎంపికైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

జనార్దన్‌రెడ్డికి ఘన నివాళి

కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పి.జనార్దన్‌రెడ్డి వర్ధంతిని శనివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. పేద ప్రజల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దంగు శ్రీనివాస్‌దవ్, బస్వం, అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి ఫ్యాన్ల అందజేత

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పది సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాల ఆవరణలో శనివారం లయన్స్ సభ్యులు కండె ఓంకారం, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అంజయ్యలు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శేఖర్, శ్రీను, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్
- జీపీ కార్మికుల నిరసన



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆరోపించారు. సమ్మెలో భాగంగా కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీఓ గీతకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా పంచాయతీ కార్మికులుగా పనిచేసి మరణించిన వారికి ఎలాంటి పరిహారం కాని, బీమా సౌకర్యం కాని అందడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, ప్రతి నెలా రూ.18 వేల వేతనంతో పాటు రూ.10లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారోబార్లు నర్సింహ, హరికృష్ణ, కార్మికులు జంగయ్య, రాములు, చంద్రయ్య, చెన్నయ్య, రాములమ్మ, లక్ష్మమ్మ, రాధిక, విజయ, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లకు చదువే ఆయుధం

సీఐ సుధాకర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ సుధాకర్ తదితరులు

బడంగ్‌పేట్: ఆడపిల్లలకు చదువే ఆయుధమని, బాలికలు తమ విద్యను పూర్తి చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. శనివారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చైల్డ్ రైట్స్ అండ్ యూ, బాలల హక్కుల జిల్లా కో–ఆర్డినేటర్ కొమ్ము తిరుపతి ఆధ్వర్యంలో బాలికలు చదువుకోవాలి అనే కాన్సెప్ట్‌తో కూడిన వాల్‌పోస్టర్‌ను ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకొని, ఉన్నత రంగాల్లో రాణించాలని సూచించారు. బాల్యావివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అమ్మాయిల చదువు దేశానికి వెలుగని, వారిని చదువులో తల్లిదండ్రులు ప్రోత్సహించాని సూచించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా నాయకులు సల్వాది రమేశ్, జర్పుల కృష్ణ తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



నాలా పనులను కమిషనర్‌కు వివరిస్తున్న కౌన్సిలర్ అహ్మద్ కసాది

పహాడీషరీఫ్: నబీల్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జల్‌పల్లి మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ అహ్మద్ కసాది అన్నారు. పెండింగ్ పనుల కారణంగా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల విషయాన్ని ఆయన కమిషనర్ బి.వెంకట్రామ్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నబీల్ కాలనీలో నెలకొన్న ముంపు సమస్యపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో నాలా నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కానీ ప్రస్తుతం కొనసాగుతున్న నాలా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఆరోపించారు. అసంపూర్తి పనుల కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. నబీల్ కాలనీ నుంచి గుర్రం చెరువు వరకు ఈ పనులు పూర్తి చేస్తేనే బస్తీకి ముంపు సమస్య తీరుతుందన్నారు. కాలనీకి ఎగువన రూ.6.5 కోట్లతో చేపట్టిన పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే సబితారెడ్డికి ఫోన్‌లో వివరించినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తానని ఆమె హామీనిచ్చారని కౌన్సిలర్ తెలిపారు. కాలనీలో దోమల నివారణ కోసం ఎప్పటికప్పుడూ ఫాగింగ్ నిర్వహిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణాధికారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

హుడాకాంప్లెక్స్: పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం సరూర్‌నగర్‌లోని సంఘం కార్యాలయం వద్ద భావన రుషి సహకార గృహ నిర్మాణ సంఘం, కాప్రా చైర్మన్ సీతాఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ ప్రాంతంలో పద్మశాలీలు అధికంగా ఉన్నందున సంఘం కార్యాలయం కోసం విశాల భవనం నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సంఘం అధ్యక్షుడు పున్న గణేశ్ మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగి, సంఘం తరపున పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు కర్నాటి ధనుంజయ, కర్నాటి వెంకటేశం, బురుగు తులసీదాస్, వేముల రాములు, బొమ్మ రఘురాం, గుర్రం శ్రావణ్, విశ్వేశ్వర్, కొకుంట్ల రవితేజ, గడ్డం లక్ష్మీనారాయణ, తలాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



మహేశ్వరం: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నిర్వాహకులు



పహాడీషరీఫ్: వేలం పాటలో పూల మాలలను దక్కించుకున్న మాలధారణ భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ గంట వెంకట్‌రెడ్డి, జిల్లా రైతు కమిటీ సభ్యురాలు గంట అర్పితారెడ్డి అయ్యప్ప ఇరుముడి మహాపడి పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కేశవ్ గురుస్వామి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. గురుస్వాములు, భక్తులతో కలిసి గంట అర్పితారెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులు అయ్యప్ప మహాపడిని వెలిగించారు. గంట సురేందర్‌రెడ్డి స్వాములు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులు ఇరుముడులతో శబరిమలకు తరలివెళ్లారు. ఇరుముడి మహాపూజకు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బడంగ్‌పేట్ నగర మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్ప భక్తులు పూజకు విచ్చేసిన అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంబయ్యయాదవ్, మాజీ సర్పంచ్‌లు గంట వెంకట్ రెడ్డి, మద్ది కరుణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూలమాలల వేలం

పహాడీషరీఫ్: రెండురోజుల క్రితం ముగిసిన మామిడిపల్లి శ్రీ బాల మణికంఠ అయ్యప్పస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన 11 పూల మాలలకు శనివారం వేలం పాట నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో స్వామివారి మెడలోని పూలదండ రూ.11,600లు, పంచవస్త్రం రూ.11,500ల చొప్పున పరమేశ్వర్‌రెడ్డి రూ.23,100లకు దక్కించుకున్నాడు. ద్వితీయ పూలమాలను ఈరంకి విజయ్‌గౌడ్ 1000 రూపాయలకు దక్కించుకోగా, మిగిలిన మాలలను ఒక్కొక్కటి రూ.500ల చొప్పున అయ్యప్ప మాలధారణ భక్తులు దక్కించుకున్నారు. పూల మాలలు, పంచ వస్త్రం వేలానికి సంబంధించి రూ.30వేల ఆదాయం సమకూరిందని ఈ సందర్భంగా జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. అయ్యప్ప స్వామివారి మాల దక్కించుకుంటే శుభం జరుగుతుందన్న విశ్వాసంతోనే పోటీపడి కైవసం చేసుకున్నారన్నారు.